సాక్షి
చిత్తూరు
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



సేవాసైన్యం.. రాజీనామా పర్వం
టీడీపీ నేతల వేధింపులకు నిరసనగా వలం టీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు.
- 8లో



పకడ్బందీగా ర్యాండమైజేషన్
జిల్లాలోని ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో పకడ్బం దీగా నిర్వహించారు.
- 8లో



300 సెల్‌ఫోన్ల అప్పగింత
రికవరీ చేసిన 300 సెల్‌ఫోన్‌లను పోలీసులు పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం అప్పగించారు.
- 8లో

న్యూస్‌రీల్

'కోడ్' ఉల్లంఘనపై ఆరు కేసులు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యం లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) ఉల్లం ఘించిన ఘటనపై ఇప్పటి వరకు జిల్లాలో ఆరు కేసులు నమోదయ్యాయి. ఉల్లంఘనుల్లో టీడీపీ, బీజేపీ నాయకులే ఎక్కువగా ఉన్నారు. చౌడేపల్లిలో బీవైసీ పార్టీ నాయకుడు రామచం ద్రా యాదవ్ ర్యాలీలో బాణసంచా పేల్చడం, చిత్తూరులోని ఎన్ఆర్ పేటలో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు ప్రచారంలో మద్యం బాటిళ్లు పంపిణీ చేయడంపై రెండు కేసులు నమోదయ్యాయి. అలాగే రొంపిచెర్ల ప్రచారంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా బాబు నిబంధనలు అతిక్రమించడం, ఐరాలలో రం జాన్ తోఫా పంపిణీ చేసిన టీడీపీ నేతలు సం చులకు పార్టీ చిహ్నాలు ముద్రించి ఇవ్వడంపై అధికారులు కేసులు నమోదు చేశారు. ఈక్రమంలోనే పలమనేరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ విద్యార్థులకు అందించిన పరీక్ష ప్యాడ్‌లకు పార్టీ రంగులు వేయడంపై సైతం కేసు నమోదైంది.

బోయకొండలో రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే ఆలయం శుద్ధి చేసి మామిడి, వేపాకు, పూలతోరణాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగ రాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాహుకాల సమయంలో నిర్వహించిన అభిషేకానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం సుమారు 2వేల మంది భక్తులకు అన్నప్రసా దాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యుడు రాజేష్ పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవిరాజు

చిత్తూరు రూరల్: హైరిస్క్ గర్భిణులకు మెరు గైన వైద్యం అందించాలని ఇన్‌చార్జి డీఎం హెచ్‌ఓ రవిరాజు ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని తన కార్యాలయంలో వైద్య సిబ్బందితో మాతృమరణాలపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. గర్భిణులు ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. హైరిస్క్ కేసులపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిం చారు. ప్రసవానికి సకాలంలో ప్రభుత్వాస్ప త్రికి తీసుకొచ్చేలా చూడాల్సిన బాధ్యత వైద్యు లపై ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో వైద్యాధికారి జానకీరావ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం



సర్వేయర్‌లకు సర్టిఫికేట్లు అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్ సమావేశ మంది రంలో శుక్రవారం ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం నిర్వహించారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వే కోసం వచ్చే ప్రజలు న్యాయం జరిగి తిరిగి చిరునవ్వుతో ఇంటికి వెళ్లేలా సర్వేయర్లు పనిచేయాలన్నారు. సర్వే వృత్తి చాలా గొప్పదని, ప్రభుత్వం వందేళ్ల తర్వాత భూ రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఎంతో శ్రమతో కూడుకున్న పని అయినప్పటికీ సర్వేయర్లు కష్టపడ్డారని వెల్లడించారు. రికార్డు లను ప్రక్షాళన చేసుకుంటే సర్వే పనుల్లో ఎలాం టి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో సర్వేయర్లు కీలకమన్నారు. రూట్ మ్యాపులు తయారు చేయడంతో పాటు ఆయా ఆర్ఓ, ఏఆర్‌ఓలకు సహకరించాలని సూచిం చారు. అనంతరం విధుల్లో, వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు, పత కాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా పాల్గొన్నారు.

వైద్యం.. వైవిధ్యం





ఈ ఫొటోలోని వృద్ధురాలిపేరు లక్ష్మమ్మ. పెద్దపంజాణి మండలం బొమ్మరాజుపల్లె గ్రామం. సుమారు ఏడేళ్ల క్రితం కింద పడిపోయింది. దీంతో నరాల దెబ్బతిని నడవలేక ఇబ్బంది పడుతూ వచ్చింది. గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. ఇటీవల ఆరోగ్య శ్రీ ద్వారా నడుముకు శస్త్రచికిత్స చేయించుకుంది. ఆ తర్వాత కూడా ఆస్పత్రికి వెళ్లేందుకు అవస్థలు పడేది. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఆమెకు అండగా నిలిచింది. డాక్టరే ఇంటికొచ్చి పరీక్షలు చేస్తున్నారు. మందులు, మాత్రలను ఉచితంగా అందిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పిందని..డాక్టర్లు మంచిగా చూస్తున్నారని వృద్ధురాలు సంతోషంగా చెబుతోంది.



తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లెకు చెందిన మత్తయ్య పుట్టుకతోనే పక్షవాతానికి గురయ్యాడు. కాళ్లు కదపలేని పరిస్థితి. మంచానికే పరిమిత మయ్యాడు. గతంలో ఆస్పత్రికి వెళ్లాలంటే కుటుంబ సభ్యులు ఆటోలో చిత్తూరుకు తీసుకెళ్లేవారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళితే అక్కడ ఫీజులు తడిసి మోపెడయ్యేవి. ఫ్యామిలీ ఫిజీషియన్ వచ్చాక ఇంటి వద్దకే డాక్టర్లు వెళుతున్నారు. మత్తయ్యకు వైద్య పరీక్షలు చేస్తూ అవసరమైన మందులు, మాత్రలు ఇస్తున్నారు. ఫలితంగా వ్యయ ప్రయాసలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. దీనిపై మత్తయ్య సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఆస్పత్రికి వెళ్లే పెద్ద కష్టం తప్పిందని వెల్లడిస్తున్నాడు.

- జిల్లాలో విజయవంతంగా 'ఫ్యామిలీ డాక్టర్'
- పల్లె బాట పట్టిన వైద్యులు
- మంచానికి పరిమితమైన వారికి ఇంటి వద్దే చికిత్స
- ఉచితంగా పరీక్షలు.. మందులు
- విశిష్ట కార్యక్రమంపై గ్రామీణుల హర్షం

దశాబ్దాలుగా పల్లె సీమలు చిన్నచూపునకు గురయ్యాయి. కనీస వైద్యసేవలకు సైతం దూరంగా నిలిచిపోయాయి. రోగం వస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిన దుస్థితిలో ఏళ్లు గడచిపోయాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణులకు మంచి రోజులు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి నెలా రెండు పర్యాయాలు డాక్టర్లే పల్లెకు వచ్చి చికిత్సలందిస్తున్నారు. వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. దీనిపై పల్లెవాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యయప్రయాసలు తప్పాయని సంతోషంగా వెల్లడిస్తున్నారు.

చిత్తూరు రూరల్ : పల్లెల్లోని పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అభయమిచ్చింది. వైద్యసేవల్లో నూతన విధానాలను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం సక్రమంగా వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఫ్యామిలీ డాక్టర్ వి. ధానాన్ని సమర్థంగా అమలు చేసి చూపించింది. జిల్లాలో 2022 అక్టోబర్ 21 నుంచి ట్రయల్ రన్‌తో అమలవుతున్న ఈ కొత్త విధానంతో లక్షలాది మంది ఉచితంగా వైద్యం పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచానికే పరిమితమైన రోగుల ఇంటికే నేరుగా ప్రభుత్వ వైద్యుడే వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తుండడంతో ప్రజల నుంచి అద్భుత స్పందన వస్తోంది. అలాగే వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నవారికి మొబైల్ మెడికల్ యూనిట్ 104 వాహనాల ద్వారా ఓపీ వైద్యంతోపాటు పరీక్షలు, మందులు ఇచ్చే ప్రక్రియ కూడా ఈ విధానానికి తోడు కావడం మరింత ప్రశంసలు తీసుకువస్తోంది.

మార్చిలో ఫ్యామిలీ డాక్టర్ సేవల వివరాలు	
జనరల్ ఓపీ	12,972
ఏఎన్‌సీ	8,037
పీఎన్‌సీ	2,114
అనీమియా	755
హైపర్‌టెన్షన్	17,679
డయాబెటిస్	14,848
డయాబెటిస్, హైపర్‌టెన్షన్	20,595
ఓరల్ క్యాన్సర్	178
బ్రెస్ట్ క్యాన్సర్	22
సర్వైకల్ క్యాన్సర్	100
టీబీ	88





ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా ప్రజలకు చికిత్స అందిస్తున్న వైద్యులు

పకడ్బందీగా ప్రక్రియ

జిల్లాలోని 50 పీహెచ్‌సీలకు సంబంధించి 464 విలేజ్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలవుతోంది. ఇందుకోసం మొత్తం 44 ఎంఎంయూ 104 వాహనాలను వినియోగిస్తున్నారు. ప్రతి నెలా రెండు రోజులు గ్రామాల్లో ఈ విధానం అమలయ్యేలా షెడ్యూలును ఉన్నతాధికారులు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. జిల్లాలో 102 మెడికల్ ఆఫీసర్లు పూర్తి స్థాయిలో విధుల్లో ఉన్నారు. ఇలాగే 104 వాహనం వద్ద ఓపీ వద్ద 14 రకాల పరీక్షలతో పాటు 67 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు.

పరీక్షలు ఇలా..

- గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్
- హిమోగ్లోబిన్ టెస్ట్
- ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్)
- మలేరియా టెస్ట్
- హెచ్‌ఐవీ నిర్ధారణ
- డెంగీ టెస్ట్
- మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్ స్టిక్)
- అయోడిన్ టెస్ట్
- వాటర్ టెస్టింగ్
- హెపటైటిస్–బి నిర్ధారణ
- ఫైలేరియాసిస్ టెస్ట్
- సిఫిలిసిస్ ర్యాపిడ్ టెస్ట్
- విజువల్ ఇన్‌ఫెక్షన్
- స్పుటమ్ (ఏఎఫ్‌బీ)

సేవలు ఇలా...

- జనరల్ అవుట్ పేషెంట్ సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం తదితర జీవనశైలి వ్యాధుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటినేటల్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటల్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు
- చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు
- రక్తహీనతతో బాధ పడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స జరిగిన రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారు, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం
- పాలియేటివ్ కేర్
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ

ఇంటికొచ్చే పరీక్షలు చేస్తున్నారు



ఫ్యామిలీ డాక్టర్ కింద ఇంటికొచ్చే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నాకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వాటికి ఉచితంగానే చికిత్స చేశారు. ఇలా ఇంటికొచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. బాగానే ఉంది.. ఏ ప్రభుత్వం ఇలా చేయలేదు. మందులు, మాత్రలు కూడా ఉచితంగా ఊర్లోనే ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరం.
– విజయమ్మ, పైమాగం, తవణంపల్లె మండలం

మా ఊరికే వస్తున్నారు



ఆరు నెలలకు క్రితం అనారోగ్యం బారిన పడ్డా. వ్యానులో మాఊరికి డాక్టర్ వస్తున్నారని తెలిసి అక్కడు వెళ్లి పరీక్షలు చేయించునున్నా. బీపీ, షుగర్ లేవు అన్నారు. రక్త పరీక్ష చేశారు. రక్తం తక్కువ ఉందని మందులు, టానిక్ ఇచ్చారు. అలాగే ఒళ్లు నొప్పులకు మాత్రలు ఇచ్చారు. బాగా తగ్గాయి. ప్రతీ నెలా చెకప్ చేయించుకుంటున్నా. ఆరోగ్యం బాగుంది. ఫ్యామిలీ డాక్టర్ వల్ల పేదలకు మేలు జరుగుతోంది.
– లక్ష్మమ్మ, పాలకూరు, పూతలపట్టు మండలం

ఆరోగ్యం మెరుగుపడింది



మా ఊరిలో శిబిరం పెట్టినప్పుడు వెళ్లి వైద్య పరీక్షలు చేయించా. ఈ వైద్యులు మందులు ఇచ్చాక నా ఆరోగ్యం మెరుగుపడింది. ప్రతి నెలా ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సిబ్బంది వచ్చి తనిఖీలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇచ్చి వెళుతున్నారు. ఈ మందులే నన్ను కాపాడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మళ్లీ గెలిస్తే మాలాంటి వాళ్లం బాగుంటాం. ఆయనకు దేవుడు సైతం తోడుంటాడు.
–సురేంద్రరెడ్డి, టి. పుత్తూరు, తవణంపల్లె

'కూటమి'కి ఓటమి తథ్యం



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటమి తథ్యమని, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం సదుం మండలంలోని ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని, తమ హయాంలో ఈప్రాంతం రైతుల కోసం మూడు ప్రాజెక్టులు నిర్మిస్తుంటే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల అనంతరం న్యాయపరమైన సమస్యలు పరిష్కరించి ఒక్క సంవత్సరంలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి సాగు, తాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. కూటమి గెలిస్తే మైనార్టీలకు సమస్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సీఎంగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో దిగారని, ఆయనపై పోటీ చేస్తున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు చెబితే ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెపితే అమ్మ ఒడి లాంటి ఎన్నో పథకాలు గుర్తుకువస్తాయన్నారు. సీఎం చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో అలాంటి పథకం ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. పేదలను సంక్షేమ పథకాలతో ఆదుకున్న ఘనత జగన్‌దని, జన్మభూమి కమిటీలతో దోచుకున్న చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచేందుకు అమలు కాని హామీలతో మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు వస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని చెప్పారు. ఆసరా నాలుగో విడత మొత్తం త్వరలోనే మహిళల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. అప్పటి సీఎం కిరణ్ దుర్మార్గ ఆలోచనలతో రాష్ట్రం విడిపోవడంతో పాటు తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడగానే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా నిలుపుతామని హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలోకి బీసీవై నేతలు



పార్టీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు మండలానికి చెందిన బీసీవై పార్టీ నేతలు శుక్రవారం తిమ్మానాయనపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో ఉలవల దిన్నెకు చెందిన హితేష్, మునేష్, గణేష్, ఆనంద, విజయ్, హరి, రవి, చెంగప్ప, బాలాజీ కాలనీకి చెందిన మహేష్, శాంతినగర్‌కు చెందిన శివ ఉన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు లీలాధరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ధనుంజయరెడ్డి, అమరావతి, నాయకులు రాజారెడ్డి, తిమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆనంద, మల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పుత్రాజు, వినోద్, శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటస్వామి, బాబురెడ్డి, ఎల్లారెడ్డి, గౌరీరెడ్డి, రమేష్‌రెడ్డి, చిన్నరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా తనిఖీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలు పాటిస్తూ కట్టుదిట్టంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఈ నెల 11వ తేదీ వరకు తనిఖీల్లో సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువుల వివరాలను వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో లెక్కలు చూపని నగదు రూ. 2,29,66,410 సీజ్ చేశామన్నారు. బియ్యం, గోడగడియారాలు, కుక్కర్స్, డ్రెస్ మెటీరియల్స్ తదితరాలకు సంబంధించి రూ.46,98,845 విలువ చేసే వస్తువులు, రూ. 4,47,35,387 విలువ చేసే బంగారం, వెండిని సీజ్ చేశామని వివరించారు. రూ. 50 వేలకు పైగా ఆధారాలు లేకుండా నగదు తీసుకెళితే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

మేమంతా మీ వెంటే..!



డిప్యూటీ సీఎం నారాయణస్వామితో తోటానుపల్లె గ్రామస్తులు

వెదురుకుప్పం : ''జగనన్న ప్రభుత్వంలో అన్ని పథకాల ద్వారా లబ్ధి పొందాం... మేమంతా ఎప్పటికీ మీ వెంటే ఉంటాం .. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేదుకు సిద్ధంగా ఉన్నాం'' అంటూ వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీ జడబాపనపల్లె, తోటానుపల్లె దళితవాడ వాసులు ముక్త కంఠంతో చెప్పారు. ఆ రెండు గ్రామాల వారు టీడీపీలో చేరినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం సాయంత్రం ఆయా పల్లెల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకుని తమ మద్దతు తెలిపారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎస్సీల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా టీడీపీ నేతలు ప్రలోభాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పేదల తలరాతలు మారుస్తున్న సీఎం జగనన్నను ఆదరించాలని ఓటును అమ్మకోవద్దని సూచించారు. మళ్లీ మన ప్రభుత్వం వస్తే మీ సమస్యలన్నీ తీరుస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మాజీ ఎంపీపీ పురుషోత్తం, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్, సర్పంచ్‌లు గోవిందయ్య, రాజశేఖర్ రెడి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీగా ఈవీఎంల ర్యాండమైజేషన్


ర్యాండమైజేషన్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో పకడ్బందీగా ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరాలు పంపించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను ర్యాండమైజేషన్ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కట్టుదిట్టమైన నిఘా నడుమ తొలి విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తి అవ్వగానే కలెక్టరేట్‌లోని ఎన్నికల గోడౌన్‌లో నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను భద్రపరిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ఈవీఎం మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీదేవి, రాజకీయపార్టీల ప్రతినిధులు ఉదయ్, భాస్కర్, అట్లూరి శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ నిధులతో నీటి వనరులకు మరమ్మతులు చేయించుకోవాలన్నారు. ప్రజలు, ఉపాధి కూలీలు వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓలు బాధ్యతగా పనిచేసి నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కుప్పం, పలమనేరు, పుంగనూరులో నీటి సమస్య ఉంటుందని, నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ గ్లోరియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.


పుత్తూరులో మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు


రొంపిచెర్లలో..


రొంపిచెర్లలో..


రొంపిచెర్లలో..


గంగవరంలో..


పులిచెర్లలో..


బైరెడ్డిపల్లెలో..

సేవాసైన్యం..రాజీనామా పర్వం

వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తమపై విషం కక్కిన టీడీపీ నేతలపై సైవాసైన్యం మండిపడుతోంది. కూటమి పార్టీల వైఖరిపై తీవ్ర నిరసన వెలిబుచ్చుతోంది. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా విధులు నిర్వర్తిస్తుంటే అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. సంక్షేమ పథకాలు లబ్ధిదారుల దరి చేరకుండా అడ్డుపడడం దారుణమని విమర్శిస్తోంది. అసత్య ఆరోపణలతో మనస్తాపానికి గురి చేసిన పచ్చనేతలకు తమ రాజీనామాలే సమాధానమని స్పష్టం చేస్తోంది. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో వలంటీర్లు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగారు. ఒక్కరోజే మొత్తం 304 మంది తమ రాజీనామాలను సమర్పించారు. అందులో రొంపిచెర్ల మండలం నుంచి 126 మంది, పులిచెర్ల నుంచి 15 మంది, గంగవరం నుంచి 24 మంది, పుత్తూరు నుంచి 34 మంది, బైరెడ్డిపల్లె నుంచి 26 మంది, చౌడేపల్లె నుంచి 49 మంది, పలమనేరు మండల నుంచి 33 మంది ఉన్నారు.

– రొంపిచెర్ల, పులిచెర్ల, గంగవరం, పుత్తూరు, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, పలమనేరు


చౌడేపల్లెలో..


చౌడేపల్లెలో..


పలమనేరులో..

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


హేమంత్ చౌదరికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


టీడీపీ కార్యకర్తలకు కండువా వేస్తున్న సునీల్‌కుమార్

పలమనేరు : సీమాంధ్ర జిల్లా స్టూడెంట్స్ విభాగం నాయకుడు హేమంత్ చౌదరి శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, నాయకులు మండీ సుధా, రాజేష్, జగ్గ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళెం: మండలంలోని నల్లంగాడుకోటూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఈ మేరకు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఛాయాపతి, అరుణాచలం, భాను, ఎస్.బాబు, విజయ్, ఆనంద్, చిరంజీవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పాలఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక రాజీనామా


కరకంబాడిలో గ్రామ వలంటీర్ల రాజీనామా

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లి, కరకంబాడి పరిధిలోని 20 మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. మండలంలోని గురవరాజుపల్లి పంచాయతీ పరిధిలో 9మంది, కరకంబాడి-3 సచివాలయ పరిధిలో 11మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. వారు సచివాలయానికి చేరుకుని రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామన్నా నమ్మే అవివేకంలో వలంటీర్లు లేరన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

జిల్లా సమాచారం

కేటగిరీ	పరీక్షలు రాసిన వారు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణతా శాతం
ఫస్టియర్ (జనరల్)	13,224	6,566	50
సెకెండియర్ (జనరల్)	10,882	6,817	63
ఫస్టియర్ (ఒకేషనల్)	1,839	941	51
సెకెండియర్ (ఒకేషనల్)	1,610	1,008	63


ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్న డీవీఈఓ సయ్యద్ మౌలా.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జూనియర్ ఇంటర్‌లో 50 శాతం, సీనియర్ ఇంటర్‌లో 63 శాతం ఉత్తీర్ణతను విద్యార్థులు సాధించారు.మొదటి సంవత్సరం ఫలితాలకు సంబంధించి చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 25వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 26వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది కొత్త జిల్లాల ప్రాతిపదికన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను ప్రకటించారు. చిత్తూరు పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలోని డీవీఈఓ కార్యాలయంలో జిల్లా ఫలితాలను డీవీఈఓ సయ్యద్ మౌలా విడుదల చేశారు.

బాలికలదే హవా : ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలురకంటే బాలికలే ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్టియర్ జనరల్ పరీక్షలకు 6,523 మంది బాలురకు గాను 2,719 మంది ఉత్తీరత సాధించారు. బాలికలు 6,701 మందికి గాను 3,847 మంది ఉత్తీర్ణత పొందారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలకు 5,297 మంది బాలురకు గాను 2,997 మంది ఉత్తీర్ణత పొందారు. బాలికలు 5,585 మందికి గాను 3,820 మంది ఉత్తీర్ణత సాధించారు.


ఒకేషనల్‌లోనూ బాలికలే ముందంజలో నిలిచారు. ఒకేషనల్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో చదువుతున్న బాలికలు బాలుర కంటే అధిక శాతం ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో కేజీబీవీ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 218 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా 154 మంది ఉత్తీర్ణత పొందారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 183 మందికి గాను 158 మంది ఉత్తీర్ణత చెందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి అభినందనలు తెలిపారు.

మెరుగైన ఫలితాలు

ఇంటర్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించాం. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాం. అనుకున్న మేర కాకున్నా కొంత మెరుగైన ఫలితాలే వచ్చాయి. పిల్లలను మార్కులు, ర్యాంకుల పేరుతో తల్లిదండ్రులువేధించకూడదు. పక్క పిల్లలతో పోల్చి కించపరచకూడదు. ఎన్ని మార్కులు వచ్చినా పిల్లలను, చదివిన చదువును గౌరవించండి. ఫెయిల్ అయితే సప్లిమెంటరీలో మంచి మార్కులు వచ్చేలా ప్రోత్సహించండి. విద్యార్థులు క్షణికావేశంలో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదు. ఎంతో భవిష్యత్ ఉందనే విషయాన్ని గుర్తించాలి.

– సయ్యద్ మౌలా, ఇంటర్మీడియట్ డీవీఈఓ

జిల్లా టాపర్‌గా దీక్షిత



పెనుమూరు (కార్వేటినగరం) : ఇంటర్ సెకెండియర్ ఫలితాల్లో పెనుమూరు జూనియర్ కళాశాల విద్యార్థిని దీక్షిత (ఎంపీసీ) జిల్లా టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపల్ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1000 మార్కులకు గాను దీక్షిత 975 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. సత్తా చాటిన విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ప్రచారాలపై సమాచారం తప్పనిసరి


విలేకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటింటి ప్రచారానికి వెళ్లేముందు ఆయా పార్టీల అభ్యర్థులు ముందస్తుగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం తప్పనిసరని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. 29వ తేదీన ఎన్నికల బరిలో నిలబడిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. జిల్లాలో 11 వేలకు పైగా ఉద్యోగులు, 23 వేలకు పైగా విభిన్నప్రతిభావంతులు, 6 వేలకు పైగా 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు పోస్టల్‌బ్యాలెట్ అందజేసేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు. ఈ క్రమంలో వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి ఫారమ్ 12 డి అందజేసి సుముఖత తీసుకుంటారన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌లను శిక్షణ సమయంలోనే వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా వీడియో కవరేజ్ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 11వ తేదీ వరకు రూ.2.29 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వోద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వేటు తప్పదని హెచ్చరించారు. కూడళ్లు, రోడ్లపై అభ్యర్థులు సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇళ్లపై చిన్న స్టిక్కర్లు వేసుకోవచ్చని, పెద్ద హోర్డింగ్ పెట్టుకోవాలంటే మాత్రం పర్మిషన్ పొందాలని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అభ్యర్థుల ఖాతాలో ఎన్నికల ఖర్చు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మొత్తానికి మించి ఖర్చు పెట్టకూడదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సి-విజిల్‌కు 386 ఫిర్యాదు వచ్చినట్లు వెల్లడించారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా గంగ జాతర నిర్వహించాలనుకుంటే అనుమతి తీసుకోవాలని, పోలింగ్ తర్వాత యథేచ్ఛగా జాతర జరుపుకోవచ్చని తెలిపారు. సమావేశంలోజేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్డీఓ చిన్నయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

300 సెల్‌ఫోన్ల అప్పగింత

- సైబర్‌క్రైమ్ ఫిర్యాదులకు నంబర్ : 1930
- ఎస్పీ మణికంఠ వెల్లడి


బాధితురాలికి ఫోన్ అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను 'చాట్‌బాట్' యాప్ ద్వారా పోలీసుశాఖ రికవరీ చేసింది. సుమారు రూ.65 లక్షల విలువైన 300 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించింది. శుక్రవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. సెల్‌ఫోన్ల రికవరీకి జిల్లా పోలీసుశాఖ రూపొందించిన ×చాట్ బాట్₹ యాప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. బాధితులు ఎవరైనా 9440900004 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే చాలని తెలిపారు. ఇందులో అడిగే ప్రశ్నలకు సమాధానాలిస్తే ఫిర్యాదు నమోదవుతుందన్నారు. చాట్‌బాట్ జిల్లాలో ప్రవేశపెట్టినప్పటి నుంచి అయిదు దశల్లో రూ.3.15 కోట్ల విలువైన 1,500 ఫోన్లను తెప్పించి బాధితులకు అందజేశామని వెల్లడించారు. అలాగే సైబర్‌క్రైమ్ ఉచ్చులో పడి నగదు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు చెప్పాలన్నారు. ఇలా చేయడం వల్ల నగదు బ్యాంకు ఖాతాలు మారకుండా ఫ్రీజ్ చేస్తామని తెలిపారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు.